RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 22 | డిసెంబర్ 25, 2025 | వెల : రూ.3-00




పార్ట్ టైమ్ జాబ్ మోసాలపై జాగ్రత్త





# గజగజ!

## వణికిపోతున్న తెలంగాణ

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పల్లె, పట్టణం తేడా లేకుండా చలిగాలులు
- ఉదయం 10 దాటుతున్నా వీడని పొగమంచు
- మంచు దుప్పటితో ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- సంగారెడ్డి జిల్లా కోహిర్లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్
- బయటికి రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- చలితో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వృద్ధులు
- జాగ్రత్తలు అవసరం అంటున్న నిపుణులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రాన్ని చలి గజగజ వణికిస్తోంది. సాధారణంగా జనవరిలో కనిపించే చలి, ఈసారి డిసెంబర్‌లోనే ఉధృతంగా పట్టు బిగించడంతో జనజీవనం స్తంభించిపోతోంది. ముఖ్యంగా రాత్రి వేళలు, తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వెనకాడుతున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గి నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పొడి వాతావరణం, ఉత్తర భారతదేశం నుంచి వీచుతున్న చల్లని గాలుల ప్రభావంతో చలి తీవ్రత మరింతగా అనిపిస్తోంది. ఈ చలి ప్రభావం ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రంగా కనిపిస్తోంది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడం ఈ శీతాకాల తీవ్రతకు అద్దం పడుతోంది.

3లో..

# సాయుధ దళాల సవాళ్లను అర్థం చేసుకోవాలి

- బాధ్యతాయుత ఆర్థిక పర్యవేక్షణ అవసరం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రక్షణ ఖాతాల సేవా ప్రొబేషన్ అధికారులతో భేటీ



**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**


భారత రక్షణ ఖాతాల సేవకు చెందిన ప్రొబేషన్ అధికారులు బుధవారం ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి వారితో మాట్లాడుతూ.. రక్షణ సేవలకు సంబంధించిన ప్రధాన లెక్కల, ఆర్థిక అధికారులుగా మీరు కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. సాయుధ దళాలు ఎదుర్కొనే ప్రత్యేకమైన సవాళ్లు, కష్టాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను

మిగతా 3వ పేజీలో..

# విద్యార్థులు లేని ప్రభుత్వ స్కూల్స్ బంద్

- జీరో నమోదు ఉన్న పాఠశాలల తాత్కాలిక మూసివేత
- పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం
- ఈ విద్యా సంవత్సరం నుంచి గణాంకాల్లో తొలగింపు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలల విషయంలో పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల నమోదు పూర్తిగా శూన్యంగా ఉన్న పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇలాంటి పాఠశాలలను జిల్లా స్థాయి పాఠశాల విద్యా గణాంకాల్లో చూపించబోమని అధికారులు స్పష్టం చేశారు. 202425 విద్యా సంవత్సరానికి సంబంధించిన లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 2,245 ఉన్నట్లు తేలింది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో రెండు వేలకుపైగా పాఠశాలలు ఉండగా, వాటిలో 1,441 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో పాటు ఉపాధ్యాయ

మిగతా 3వ పేజీలో..

# బంగారం భగభగ..!

- తులం రూ.1.40 లక్షలు దాటిన మార్క్
- ఈ ఏడాదిలోనే లక్షన్నరకు వెళ్లే ఛాన్స్
- తానేం తక్కువ కాదంటూ వెండి పరుగులు
- కిలో రూ.2.45 లక్షలకు చేరిక..
- తర్వలోనే రెండున్నర లక్షలు దాటొచ్చంటున్న నిపుణులు





**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పెరుగుదలకు ఏమాత్రం బ్రేక్ పడకుండా రోజుకో కొత్త గరిష్టాన్ని నమోదు చేస్తున్నాయి. ఈ క్రమంలో బంగారంతో పోటీ పడుతూ వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. బంగారానికి తానేం తక్కువ కాదు అన్నట్లుగా వెండి దూకుడు కొనసాగుతోంది. ప్రస్తుతం తులం బంగారం ధర ఏకంగా రూ.1.40 లక్షల మార్క్‌ను దాటింది. కేవలం మూడు రోజుల క్రితం రూ.1.34 లక్షల వద్ద ఉన్న బంగారం ధర, స్వల్పకాలంలోనే భారీగా పెరిగి ఈ స్థాయికి చేరింది. గతంలో తులం బంగారం రూ.1.47 లక్షలకు చేరి ఆల్‌టైం రికార్డు సృష్టించగా, త్వరలోనే ఆ రికార్డును కూడా అధిగమించే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే జోరు కొనసాగితే ఈ ఏడాదిలోనే లక్షన్నర మార్క్‌ను తాకే ఛాన్స్ ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మిగతా 3వ పేజీలో..

# చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు


- అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్
- గుజరాత్ నుంచి హైదరాబాద్ వరకూ అక్రమ రవాణా
- ఏజెంట్ల నెట్‌వర్క్‌పై నిఘా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రత్యేక ఆపరేషన్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సైబరాబాద్ పోలీసులు అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠాను గుట్టురట్టు చేశారు. గుజరాత్ నుంచి పసిపిల్లలను అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో లక్షల రూపాయ

మిగతా 3వ పేజీలో..



# ఆయిల్ పామ్ రైతులు రాయితీలను ఉపయోగించుకోవాలి



- కలెక్టర్ గరిమా అగ్రవాల
- ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని 4 ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బోయినిపల్లి ప్రాథమిక సహకార సంఘంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఎకరాకు రూ. 2100, అంతర పంట సాగుకు ఎకరాకు రూ.2100.. సంవత్సరానికి మొత్తం రూ. 4200 ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాలో వేస్తుందని తెలిపారు. డ్రిప్ సేద్యం, ద్వారా నీరు అందించుటకు 80శాతం నుండి 100శాతం వరకు రైతు కేటగిరిననుసరించి రాయితీ యివ్వబడనుట్లు పేర్కొన్నారు. అలాగే దేశీ కోళ్లు, పాడి పరిశ్రమ, మేకల పెంపకం చేయవచ్చని చెప్పారు. ఇదివరకు సాగు చేసిన రైతుల అనుభవాలని వివరించి, రైతుల సందేహాలు నివృత్తి చేశారు, కొత్తగా ఆయిల్ పామ్, పంట సాగు చేసేందుకు ముందుకు రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నల్ల మోహన్, బొంగొని మహేష్, పెంచల మహేష్, ఉయ్యాల శ్రీనివాస్, ఉప సర్పంచులు, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా ఉద్యానవన అధికారి శరత్ కుమార్, పాక్స్ ప్రత్యేక అధికారి ఎండీ గౌస్ , తహసీల్దార్ నారాయణ రెడ్డి, వ్యవసాయ అధికారి ప్రణీత, సీఈఓ నరేష్, ఏఈవో శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నాల్గవ సాధారణ సమావేశం మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్, డైరెక్టర్లు మెరుపుల మహేష్, గుడి శేఖర్ రెడ్డి, నిరటి ప్రదీప్, బాలాగోని వెంకటేష్, అద్దంకి రమేష్, రోమల అజయ్, మార్కెట్ కార్యదర్శి పి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నట్టల నివారణ టీకాలు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని రుద్రూర్ గ్రామంలో గొర్రెలు, మేకలకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నట్టల నివారణ టీకాలు వేశారు. రుద్రూర్ గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ నిస్సార్ గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్, పశు వైద్య సిబ్బంది, డి. సాయిరాజ్ లైవ్ స్టాక్ అసిస్టెంట్ కే.గంగారాం, ఆఫీసు సబార్డినెట్, గొర్రెల మేకల పెంపకదారులు బోజిగొండ మల్లేష్, బోధనం పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు

- ప్రజలు వ్యక్తిని చూసి ఓటేశారు
- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి



**వేద న్యూస్, రుద్రూర్:**

కాంగ్రెస్ పార్టీ కోసం పట్టువదలని నాయకుడిగా జెండా మోసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్ పై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని బాన్సువాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. రుద్రూర్ గ్రామ సర్పంచ్ గా ఇందూరు సునీత ఇందూర్ చంద్రశేఖర్ ఎన్నికైన సందర్భంగా గ్రామంలోని శశేఖర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుద్రూర్ సర్పంచ్ గా ఇందూరు సునీత - ఇందూరు చంద్రశేఖర్ ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించినందుకు గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు పార్టీని చూసి వేయలేదని వ్యక్తిని చూసి ఓటు వేశారని వారు స్పష్టం చేశారు. ప్రజలకు పింఛన్లు, రేషన్ కార్డులు, తదితర పథకాలను మంజూరు చేసేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అండగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత- చంద్రశేఖర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీక్ చైర్మన్ తాహెర్ బీన్ అందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ జిల్లా మేయర్ సుజాత, నిజామాబాద్ జిల్లా మాజీ మేయర్ సంజయ్, డిసిసి నూతన అధ్యక్షులు కాట్పల్లి నగేష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీక్ చైర్మన్ తాహెర్ బీన్ అందాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డ్ మెంబర్లు, వివిధ మండలాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గర్శకుర్తి రజక సంఘం అధ్యక్షుడిగా అనిల్

**వేద న్యూస్, గంగాధర:**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో రజక సంఘం అధ్యక్షుడి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో లింగంపెల్లి అనిల్ గర్శకుర్తి గ్రామ రజక సంఘం అధ్యక్షుడిగా గెలుపొందరు. ఈ సందర్భంగా లింగంపెల్లి అనిల్ మాట్లాడుతూ.. సంఘు సభ్యులకు, రజకులకు, కృతజ్ఞతలు తెలిపాడు. అలాగే రజక జాతి అభివృద్ధి కోసం పాటు పడుతానని అన్నారు.

# శబరిమలై యాత్రకు అయ్యప్ప స్వాములు

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాలు చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో అయ్యప్ప మాల ధరించిన స్వాములు బుధవారం ఇరు ముడి కట్టుకుని శబరిమల యాత్రకు బయలు దేరారు. కఠినమైన నియమాలను పాటిస్తూ 41 రోజులపాటు మండల దీక్ష చేసిన స్వాములు దేవాలయంలో గురుస్వామి గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఇరుముడి కట్టినారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ శరణు ఘోషతో భజనలు చేస్తూ శబరిమల యాత్రకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ గురుస్వామి సామల భిక్షపతి, దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి, మణికంఠ స్వాములు, ఉప్పు నరసయ్య, వినుకొండ రాజ్ కుమార్, నామని శివ, కందగట్ల రమేష్, కొత్త పెల్లి రవీందర్, లోకల బోయిన కుమారస్వామి, బాసని బాలకృష్ణ, కోమటి రవికుమార్, ముల్కనూరు సంజయ్, దిలీప్, శంకరాచారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెసా చట్టం అమలుపై దేవాపూర్‌లో గ్రామసభ

**వేద న్యూస్, కాసిపేట:**



దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం పెసా చట్టం అమలుపై గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభ దేవాపూర్ గ్రామ సర్పంచ్ సిడాం రాందాస్ అధ్యక్షతన జరిగింది.గ్రామసభలో భూమి, నీరు, అడవి వనరుల నిర్వహణ, గిరిజనుల సంప్రదాయక, సంస్కృతి, హక్కుల పరిరక్షణ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ నిధుల వినియోగంపై గ్రామసభకు నియంత్రణ హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు, పెసా చట్టం ప్రకారం నూతన కమిటీ ఏర్పాటు చేయాలని గ్రామసభ ఏకగ్రీవంగా సూచనలు చేసింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు భీమయ్య, సంద్ర భూమయ్య, రోడ్డ చరణ్, కుర్సింగ రాజశేఖర్, మాజీ సర్పంచ్ మడావి వెంకటేష్, మడావి అనంతరావు, గ్రామ పెద్దలు సిడం అచ్యుతరావు, కొమరం జనార్దన్, సిడం కేశవరావు, కొమ్ముల బాపు, రోడ్డ రాజయ్య, కొడప జయరాం, కనక గోవర్ధన్, మెస్రం రంజిత్, కుర్సింగ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గంజి వాగు వద్ద తృటిలో పెను ప్రమాదం తప్పింది. కొమరవెల్లి దర్శనం చేసుకొని వేములవాడ మీదుగా సొంత గ్రామానికి వస్తుండగా కారు అదుపు తప్పింది. గంగాధర మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన వారు కారులో ప్రయాణి స్తుండగా కారు అదుపు తప్పింది. కానీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకి విన్నవించినా పలుమార్లు ఉద్యమించినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు అక్కెనపెల్లి కరుణాకర్ అన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ ఒక్క మంచి పని చేయలేదు

- ఫుట్‌బాల్, అందాల పోటీలకే వందల కోట్లు ఖర్చు చేశారు
- రాష్ట్ర ప్రజలను పట్టించుకోవడం లేదు
- నిరాశాజనకంగా రైతుల పరిస్థితి
- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని కూడా చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై, సీఎం వ్యవహార శైలిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి అందాల పోటీలు నిర్వహించడం, ఫుట్‌బాల్ ఆటల పేరుతో భారీ వ్యయం చేయడం ప్రజలకు ఏం ప్రయోజనం కలిగిస్తుందని ప్రశ్నించారు. సింగరేణి నిధులు, సీఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ నిధులతో స్టేడియంలు కట్టి సీఎం ఫుట్‌బాల్ ఆడటం ప్రజా అవసరాలకు విరుద్ధమని మండిపడ్డారు. ఈ ఖర్చులన్నీ చివరకు ఎవరికీ ఉపయోగపడవని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ పాలనలో సింగరేణి నిధులతో పాఠశాలలు, కళాశాలలు నిర్మించామని గుర్తు చేశారు. విద్యపై పెట్టుబడులు పెట్టి భవిష్యత్ తరాలకు మేలు చేశామని తెలిపారు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న వందల కోట్లతో ఎన్నో పాఠశాలలు కట్టవచ్చని, గ్రామీణ రహదారులు వేయించవచ్చని చెప్పారు. కానీ ప్రజా అవసరాలను పక్కనబెట్టి ఆటలు, వేడుకలకే ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని విమర్శించారు. రైతుల పరిస్థితిపై కూడా హరీశ్‌రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎరువులు గ్రామాలకే చేరేవని, రైతులు లైన్లలో నిలబడే అవసరం లేదని తెలిపారు. ప్రస్తుతం యాప్‌లు, మ్యాప్‌లు అంటూ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. పంటలు పండాలంటే నీరు, విద్యుత్, ఎరువులు అవసరమని, కానీ వాటి సరఫరాపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులకు నేరుగా ఎరువులు అందించామని గుర్తు చేస్తూ, ఇప్పుడు అది ఎందుకు సాధ్యం కావడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# సీతాకోకచిలుకల తోట ప్రారంభం



- ఐఐటీ హైదరాబాద్‌లో వినూత్న అడుగు
- శాస్త్రం, ప్రకృతి సమన్వయానికి ప్రతీక
- విద్యార్థులకు జీవ తరగతి గదిగా తోట
- జీవ వైవిధ్య పరిరక్షణలో కీలకం

**వేద న్యూస్, సంగారెడ్డి:**

భారతీయ సాంకేతిక సంస్థ హైదరాబాద్ ప్రాంగణంలో సీతాకోకచిలుకల తోటను ప్రారంభించారు. గ్రీన్ కార్యాలయ ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ రష్మి సింగ్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ తోటను సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ జీవ వైవిధ్య నిపుణుడు, సీతాకోకచిలుకల శాస్త్రవేత్త డాక్టర్ రవి జాంభేకర్ కూడా పాల్గొన్నారు. సీతాకోకచిలుకల జీవన చక్రం మొత్తానికి అనుకూలంగా ఈ తోటను ప్రత్యే కంగా రూపొందించారు. గుడ్డు దశ నుంచి లార్వా, కోశస్థితి, పరిపక్వ దశ వరకు అవి సురక్షితంగా ఎదగడానికి అవసరమైన ఆహార మొక్కలు, తేనె మొక్కలను జాగ్రత్తగా ఎంపిక చేశారు. అలాగే తోట మధ్యలో ఏర్పాటు చేసిన ప్రశాంతమైన చెరువు ఈ పరిసరాలను మరింత సహజంగా తీర్చిదిద్దింది. ఈ సీతాకోకచిలుకల తోట విద్యార్థులకు ఒక జీవ తరగతి గదిగా మారనుంది. ప్రకృతి అధ్యయనం, జీవ వైవిధ్య అవగాహన, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తోంది. పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రకృతిని గమనిస్తూ నేర్చుకునే విధానానికి ఇది బలమైన వేదికగా నిలుస్తోంది. జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ప్రకృతి ఆధారిత విద్యకు ఐఐటీ హైదరాబాద్ ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ తోట స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది. ప్రకృతిని కాపాడుతూ, యువతలో పర్యావరణ స్పృహను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ముందు కు సాగుతోందని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.





# గజగజ!

## వణికిపోతున్న తెలంగాణ

- ☐ రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ☐ పల్లె, పట్టణం తేడా లేకుండా చలిగాలులు
- ☐ ఉదయం 10 దాటుతున్నా వీడని పొగమంచు
- ☐ మంచు దుప్పటితో ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- ☐ సంగారెడ్డి జిల్లా కోహిర్లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- ☐ పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్
- ☐ బయటికి రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- ☐ చలితో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వృద్ధులు
- ☐ జాగ్రత్తలు అవసరం అంటున్న నిపుణులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రాన్ని చలి గజగజ వణికిస్తోంది. సాధారణంగా జనవరిలో కనిపించే చలి, ఈసారి డిసెంబర్‌లోనే ఉధృతంగా పట్టు బిగించడంతో జనజీవనం స్తంభించిపోతోంది. ముఖ్యంగా రాత్రి వేళలు,



తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వెనకాడుతున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గి నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పొడి వాతావరణం, ఉత్తర భారతదేశం నుంచి వీచుతున్న చల్లని గాలుల ప్రభావంతో చలి తీవ్రత మరింతగా అనిపిస్తోంది. ఈ చలి ప్రభావం ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రంగా కనిపిస్తోంది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడం ఈ శీతాకాల తీవ్రతకు అద్దం పడుతోంది. మొయినాబాద్‌లో 6.9, ఆదిలాబాద్‌లో 7-8 డిగ్రీలు, మెదక్‌లో 7.8, రాజేంద్రనగర్‌లో 9, హనుమకొండలో 10.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మొత్తం 33 జిల్లాల్లో 17 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే దిగువకు చేరినట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

**- హైదరాబాద్ పైనా చలి పంజా**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కూడా చలి పంజా నుంచి తప్పించుకోలేకపోతోంది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఉదయ వేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పరిసరాల్లో 9.3 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 10.1, మౌలాలి ప్రాంతంలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గచ్చిబౌలి, ఆల్వాల్, శివరాంపల్లి, జీడిమెట్ల వంటి ప్రాంతాల్లోనూ చలి తీవ్రత స్పష్టంగా కనిపిస్తోంది. నగర మధ్య ప్రాంతాల్లోనూ 12 నుంచి 13 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతూ సాధారణం కంటే తక్కువగా ఉన్నాయి.

**- పొగమంచుతో ఇబ్బందులు**

ఇదిలా ఉండగా, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను కమ్మేస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఫాగ్ కారణంగా జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై ప్రమాదాల ముప్పు పెరిగింది. కొన్ని చోట్ల రైళ్లు, బస్సులు ఆలస్యంగా నడవడం, ఉదయం వేళ వాహనాలు నెమ్మదిగా కదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**- ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**

పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భారత వాతావరణ శాఖ రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో డిసెంబర్ 26 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, వరంగల్‌తో పాటు మరో 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేస్తూ, అక్కడ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది.

**- జాగ్రత్తలు అవసరం**

వైద్య నిపుణులు ఈ చలి ప్రభావంతో వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస ఇబ్బందులు వంటి సమస్యలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో అనవసరంగా బయటకు వెళ్లకుండా ఉండటం, వెచ్చని దుస్తులు ధరించడం, వేడి ఆహారం, వేడి నీరు తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

**- ఈసారి చలి తీవ్రత ఎక్కువే**

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ చలి పరిస్థితులు ఇంకా వారం నుంచి పది రోజుల వరకు కొనసాగవచ్చు. మధ్యాహ్నం కొంతవరకు ఎండ కనిపించినా, సాయంత్రం తర్వాత చలి మళ్లీ తీవ్రంగా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉందని, వాతావరణ మార్పుల ప్రభావం కూడా ఇందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. మొత్తంగా చూస్తే, తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర జిల్లాలు గజగజ వణికే పరిస్థితి నెలకొంది. చలి, పొగమంచు కలిసి ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తున్న వేళ, రాబోయే రోజుల్లోనూ అప్రమత్తత తప్పనిసరి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే ఈ శీతాకాలపు తీవ్రత నుంచి కొంతమేర ఊరట లభిస్తుందని అధికారులు సూచిస్తున్నారు.



# బంగారం భగభగ..!

ఇక బంగారాన్ని మించి వెండి ధరలు మరింత వేగంగా పెరుగుతున్నాయి. సుమారు 20 రోజుల క్రితం కిలో వెండి రూ.2 లక్షల వద్ద ఉండగా, ఇప్పుడు అది రూ.2.45 లక్షలకు చేరింది. బుధవారం ఒక్కరోజే కిలో వెండి ధర రూ.10 వేల మేర పెరగడం గమనార్హం. ఈ పెరుగుదలతో త్వరలోనే రూ.2.50 లక్షల మార్క్‌ను కూడా దాటే అవకాశముందని ట్రేడర్లు భావిస్తున్నారు. ఈ ధరల పెరుగుదలతో వెండి అంతర్జాతీయంగా అరుదైన ఘనత సాధించింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా ప్రపంచంలోనే మూడో అత్యంత విలువైన అస్సెట్‌గా వెండి అవతరించింది. ప్రస్తుతం వెండి మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ 4.04 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఈ జాబితాలో గోల్డ్ తొలి స్థానంలో కొనసాగుతుండగా, రెండో స్థానంలో ఎన్‌విడియా ఉంది. తాజాగా యాపిల్‌ను వెనక్కి నెట్టి వెండి మూడో స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. గత వారం రోజుల్లోనే వెండి ధరలు దాదాపు 9 శాతం పెరిగాయి. ఈ ఏడాది మొత్తంగా చూస్తే వెండిలో పెట్టుబడి పెట్టిన వారికి సుమారు 140 శాతం వరకు రాబడి లభించినట్లు మార్కెట్ డేటా చెబుతోంది. దీంతో వెండి ప్రపంచంలోనే అత్యంత లాభదాయక పెట్టుబడుల్లో ఒకటిగా మారింది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశాలపై వార్తలు రావడం, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు పెరగడం నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో బంగారం, వెండిపై డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా ఈటీఎఫ్‌ల రూపంలో వెండిపై పెట్టుబడులు వెల్లువలా వస్తుండటం ధరల పెరుగుదలకు మరో కారణంగా మారింది. మొత్తంగా చూస్తే వెండిపై ఇన్వెస్టర్ల ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. ఈ ధోరణి కొనసాగితే రానున్న రోజుల్లో వెండి ధరలు మరిన్ని రికార్డులను సృష్టించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# వైకుంఠ ఏకాదశికి రండి..

- సీఎంను ఆహ్వానించిన యాదగిరి గుట్ట ఆలయ ప్రతినిధులు
- ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వక భేటీ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పుణ్యక్షేత్రాన్ని దర్శించాల్సిందిగా ఆలయ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పాటు ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినానికి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజలు, ఉత్సవాల వివరాలను ఆలయ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లు, ఆలయ సౌకర్యాలపై కూడా ఈ సందర్భంగా సమాచారం అందించినట్లు తెలిపారు. ఆలయ సంప్రదాయాలు, ధార్మిక విశేషాలను అర్చకులు వివరించగా, వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యతను కూడా వారు ప్రస్తావించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న నేపథ్యంలో, వైకుంఠ ఏకాదశి రోజున లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశముందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టినట్లు వారు తెలిపారు.



# సాయుధ దళాల సవాళ్లను అర్థం చేసుకోవాలి

రక్షణ ఖాతాల సేవా అధికారులు లోతుగా అర్థం చేసుకోవాలని రాష్ట్రపతి సూచించారు. సరిహద్దుల్లో పనిచేసే సైనికుల జీవితం, వారి ఆపరేషన్ అవసరాలు, త్యాగాలు తెలుసుకున్నప్పుడే సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకత, సమర్థ నిర్వహణ అత్యంత కీలకమని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ఖాతాలు చూసే అధికారుల నిర్ణయాలు నేరుగా దేశ భద్రతకు, సైనికుల సామర్థ్యానికి సంబంధించి ఉంటాయని గుర్తుంచుకోవాలని సూచించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే వ్యవస్థలో రక్షణ ఖాతాల సేవ కీలక స్థంభమని రాష్ట్రపతి అన్నారు. సేవాభావంతో, నిబద్ధతతో, దేశ ప్రయోజనాలను ముందుంచుకొని విధులు నిర్వర్తించాలని ప్రొబేషన్ అధికారులకు ఆమె పిలుపునిచ్చారు.

# విద్యార్థులు లేని ప్రభుత్వ స్కూళ్స్ బంద్

పోస్టులు కూడా లేవు. మరో సుమారు 600 పాఠశాలల్లో విద్యార్థులు లేనప్పటికీ ఉపాధ్యాయ పోస్టులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్యంగా ఉన్న 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయించారు. మిగిలిన పాఠశాలలపై భవిష్యత్‌లో ప్రత్యేకంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు లేకపోవడంతో బోధనా కార్యక్రమాలు జరగని పరిస్థితుల్లో ప్రభుత్వ వనరుల వృథాను అరికట్టడమే ఈ నిర్ణయానికి కారణమని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే గ్రామస్తులు తమ పిల్లలను తిరిగి ఆ పాఠశాలలకు పంపేందుకు సిద్ధంగా ఉంటే, వాటిని మళ్లీ ప్రారంభిస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. అవసరమైతే ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని తెలిపారు. అలాగే మారుమూల శివారు గ్రామాలు, తండాల్లో తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది 200 కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ గుర్తు చేసింది.

# చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

లకు విక్రయిస్తున్న ముఠా సభ్యులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు చిన్నారుల భద్రతపై తీవ్ర ఆందోళనకు దారితీసింది. సైబరాబాద్ స్పెషల్ పోలీస్ టీమ్స్ పక్కా సమాచారంతో దర్యాప్తు చేపట్టి, గుజరాత్‌కు చెందిన ఏజెంట్లతో ఈ ముఠా కొనసాగిస్తున్న అక్రమ లావాదేవీలను గుర్తించారు. చిన్నారులను అక్రమంగా తరలించి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ముఠా సభ్యుల కదలికలపై నిఘా పెట్టి కీలక ఆధారాలు సేకరించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పసిపిల్లలను రక్షించి సురక్షిత కేంద్రాలకు తరలించారు. చిన్నారులకు అవసరమైన వైద్య పరీక్షలు, సంరక్షణ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ముఠాకు మరిన్ని లింకులు ఉన్నాయనే అనుమానంతో గుజరాత్ పోలీసులుతో సమన్వయం చేస్తూ విచారణ చేపడుతున్నారు. చిన్నారుల అక్రమ రవాణాకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే 100 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పార్ట్ టైమ్ జాబ్ మోసాలపై జాగ్రత్త

- సోషల్ మీడియా ప్రకటనలే వల
- సులభ ఆదాయం పేరుతో మోసం
- వ్యక్తిగత వివరాలు ఇస్తే ప్రమాదం
- తెలంగాణ పోలీసుల హెచ్చరిక




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరిట జరుగుతున్న మోసాలపై తెలంగాణ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఆకర్షణీయ ప్రకటనలు, సులభంగా ఎక్కువ ఆదాయం వస్తుందనే హామీలతో సైబర్ నేరగాళ్లు నిరుద్యోగులు, యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారని హెచ్చరించారు. నమ్మదగిన సంస్థల పేర్లు ఉపయోగించి నకిలీ ఉద్యోగ ఆఫర్లు పంపిస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రారంభంలో చిన్న మొత్తాలతో పనులు చేయించి నమ్మకం కలిగించిన అనంతరం, అధిక లాభాల పేరుతో డబ్బులు డిపాజిట్ చేయమని ఒత్తిడి చేస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు. ఒకసారి డబ్బులు చెల్లించిన తర్వాత అకౌంట్లు బ్లాక్ చేయడం, సంప్రదింపులు నిలిపివేయడం వంటి ఘటనలు ఎక్కువవుతున్నాయని వెల్లడించారు. ముఖ్యంగా ఆన్లైన్ రేటింగ్, లైక్, షేర్ పనుల పేరుతో ఈ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉద్యోగ ం ఇచ్చే ముందు నమోదు ఫీజు, భద్రతా డిపాజిట్, పన్ను వంటి పేర్లతో డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు తెరవకుండా ఉండాలని, తెలియని వనరుల నుంచి వచ్చిన సందేశాలను నమ్మవద్దని తెలిపారు. ఇలాంటి మోసాలకు గురైన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా సైబర్ నేర విభాగాన్ని సంప్రదించాలని తెలంగాణ పోలీసులు సూచించారు. సులభ ఆదాయం అనే మాటల వెనుక దాగి ఉన్న మోసాలను గుర్తించి జాగ్రత్తగా వ్యవహరించడమే రక్షణ మార్గమని తెలిపారు. ప్రజల అవగాహ నతోనే ఈ తరహా సైబర్ నేరాలను అడ్డు కోవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.

# కేయూ ఫార్మసీ గోల్డెన్ జూబ్లీ ముగింపు సమావేశం

- డిసెంబర్ 27, 28 తేదీల్లో నిర్వహణ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ప్రతిష్టాత్మక కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ముగింపు సమావేశాలను హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో డిసెంబర్ 27, 28 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్గనైజింగ్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రెండు రోజుల కార్యక్రమానికి అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి ఫార్మసీ కళాశాలలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వెయ్యికి పైగా పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా వంద మందికి పైగా ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పూర్వపు వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లు, అధికారులు, ఫార్మసీ విభాగ ఆచార్యులు పాల్గొననుండగా, మొత్తం 1400 మందికి పైగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ గోల్డెన్ జూబ్లీ ముగింపు సమావేశాలకు యూనివర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు, బోధనా, బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్గనైజింగ్ కమిటీ గౌరవ చైర్మన్ ఆచార్య వి. మల్లారెడ్డి, చైర్మన్ ఆచార్య వి.కిషన్, కళాశాల పూర్వ విద్యార్థి, అమెరికా సంయుక్త రాష్ట్రాల నివాసి, ప్రవాస భారతీయుడు కన్వీనర్ డాక్టర్ సాంబా రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యక్షురాలు ఆచార్య జే.కృష్ణవేణి, డీన్, కన్వీనర్ ఆచార్య గాదె సమ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య ఎన్. ప్రసాద్, వైస్ చైర్మన్ ఆచార్య వై. నరసింహ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ బి.నాగరాజు, సంయక్త కార్యదర్శులు డాక్టర్ షాయేద, డాక్టర్ స్వరూప రాణి ఒక ప్రకటనలో తెలిపారు.

# 27న నూతన సర్పంచులకు సన్మానం

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు సన్మానం చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 27న ఉదయం 11 గంటలకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ హాజరవనున్నట్లు తెలిపారు. అలాగే కరీంనగర్ పార్లమెంటరీ స్థాయి, శాసనసభ, శాసనమండలి స్థానాలకు పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కూడా పాల్గొననున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ పరిధిలోని కార్పొరేషన్ చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ నామినేటెడ్ హోదాల్లో ఉన్న నాయకులు, ముఖ్య నేతలు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ ప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# జీపీ తరపున ఉచిత అంత్యక్రియలు

- రంగారావుపల్లిలో సేవా కార్యక్రమానికి శ్రీకారం

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత అంత్యక్రియల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన లంక భూదమ్మ అనే వృద్ధురాలు మృతిచెందగా, ఆమె అంత్యక్రియలను జీపీ పక్షాన నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా మరణించిన పక్షంలో గ్రామ పంచాయతీ తరపున ఉచితంగా అంత్యక్రియలు నిర్వహించాలనే నిర్ణయాన్ని జీపీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీసుకుంది. ఈ నిర్ణయం మేరకు వృద్ధురాలి మృతితో నేటి నుంచే ఈ కార్యక్రమం అమల్లోకి వచ్చింది. స్థానిక సర్పంచ్ దాసరి శంకరయ్య ఆధ్వర్యంలో జీపీ పాలకవర్గ సభ్యులు దహన సంస్కారాలకు సంబంధించిన ఖర్చు మొత్తాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. సేవా కార్యక్రమాల ద్వారా గ్రామ ప్రజలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం మానవతా ధర్మమని, గ్రామ పంచాయతీ ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు.

# నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలి



- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం జరగాలి
- డీఎంహెచ్ఓ అల్లం అయ్యప్ప

**వేద న్యూస్, శాయంపేట:**

నార్మల్ డెలివరీ అయ్యేలాగా, కాన్పులు అన్ని కూడా ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలాగా గర్భవతులను, వారి పేరెంట్స్ ను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లం అప్పయ్య అన్నారు. బుధవారం శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఆశలను ఉద్దేశించి మాట్లాడారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. శాయంపేట మండలంలో మగవారి కన్నా ఆడవారి బర్త్ రేట్ తక్కువగా ఉన్నందున తప్పనిసరిగా ఆడవారి జననాలు ఎక్కువగా జరిగేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎంఎచ్ఓ, టీబి ముక్త్ భారత్, ఎన్సీడీ ప్రోగ్రాంలపై రివ్యూ చేశారు. అందరూ కూడా సమయపాలన పాటించాలని, పాటించని వారిపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డా. సాయి క్రిష్ణ, సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# కేయూ అభివృద్ధికి వెయ్యి కోట్ల కేటాయించాలి

- లేకుంటే యూనివర్సిటీలో ఆందోళనలు చేస్తాం
- ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రూ. 1000 కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. బుధవారం యూనివర్సిటీ గెస్ట్ హౌస్ లో ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి యూనివర్సిటీ అధ్యక్షుడు చెన్నూరి సాయి కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత రాష్ట్రంలో రెండవ అతి పెద్ద యూనివర్సిటీ అని అన్నారు. ఈ కాకతీయ యూనివర్సిటీలో ఎంతో మంది మేధావులు చదువుకొని దేశంలో గొప్ప స్థాయిలో ఉన్నారని, గత పదేళ్ల కాలంలో అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవడం వల్ల వర్సిటీ తీవ్ర స్థాయిలో ఇబ్బందులకు గురైందన్నారు. విద్యార్థులకు సరిపడా హాస్టల్స్ భవనాలు లేవని, కొన్ని శిథిలావస్థలో ఉన్నాయన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్స్ సైతం సరిపడా లేవన్నారు. కొన్ని ల్యాబ్స్ ఉన్నా అవి పనిచేయడం లేదన్నారు. ఇంత చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీ అనేకమైన సమస్యలతో ఉండడం చాలా బాధాకరమన్నారు. ఇన్ని సమస్యలతో కూడుకున్న కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి చెందాలంటే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి ఇప్పుడు జరగబోయే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో కాకతీయ యూనివర్సిటీకి రూ.1000 కోట్లు నిధులను మంజూరు చేయాలని, అధ్యాపకుల నియామకాలు చేపట్టాలన్నారు. లేదంటే కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు మల్లేష్, సురాజ్, రాహుల్, ప్రణయ్, రఘు, రవితేజ, సమ్మయ్య, శీను, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో వాయు కాలుష్యం పెను సంక్షోభం



- ఎయిర్ ప్యూరిఫయర్లపై పన్ను తగ్గించాలి
- ప్రజల ఆరోగ్య హక్కుపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**

దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరిన నేపథ్యంలో ఎయిర్ ప్యూరిఫయర్లపై జీఎస్టీ తగ్గించకపోవడంపై ఢిల్లీ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితిని ఒక అత్యవసర స్థితిగా పరిగణించాలని, ప్రజల ప్రాణాలను కాపాడే సాధనాలైన ఎయిర్ ప్యూరిఫయర్లను విలాస వస్తువులుగా చూడటం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసును చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎయిర్ ప్యూరిఫయర్లను వైద్య పరికరాలుగా గుర్తించి, వాటిపై ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు, పిల్లలు, వృద్ధులపై కాలుష్య ప్రభావం దృష్ట్యా ఈ పరికరాలు అవసరమైనవేనని పిటిషనర్ వాదించారు. ధర్మాసనం ఈ సందర్భంగా గంభీర వ్యాఖ్యలు చేసింది. ప్రతి మనిషి రోజుకు సగటున సుమారు 21 వేల సార్లు శ్వాస తీసుకుంటాడని, ప్రతిసారి కలుషిత గాలిని పీల్చితే కలిగే నష్టాన్ని ఊహించుకోవాలని పేర్కొంది. ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి పొందే హక్కు ఉందని, ఆ హక్కును రక్షించడంలో పాలన విఫలమవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను కపిల్ మదన్ దాఖలు చేశారు. తీవ్ర కాలుష్య సంక్షోభ సమయంలో ఎయిర్ ప్యూరిఫయర్లను విలాస వస్తువులుగా భావించవద్దని, ప్రజారోగ్య పరిరక్షణకు అనుగుణంగా పన్నుల విధానాన్ని పునఃపరిశీలించాలని కోర్టు ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశంపై ప్రభుత్వ స్పందనపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది.


# మ్యాట్రిమోని యాప్‌లతో జాగ్రత్త

- పెళ్లి పేరుతో ఎక్కువైన మోసాలు
- నకిలీ ప్రొఫైల్స్‌తో వల.. డబ్బులు డిమాండ్
- వ్యక్తిగత సమాచారం ఇస్తే ప్రమాదం
- ప్రజలకు తెలంగాణ పోలీసుల సూచన

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మ్యాట్రిమోని వెబ్‌సైట్లు, యాప్‌లను ఉపయోగించే వారు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. పెళ్లి కోసం పరిచయమయ్యామని నటిస్తూ నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, నమ్మకం సంపాదించిన తర్వాత మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగం, విదేశీ నివాసం, అధిక ఆదాయం వంటి ఆకర్షణీయ వివరాలతో బాధితులను వలలో పడేస్తున్నారని పేర్కొన్నారు. ప్రారంభంలో చాట్‌లు, వీడియో కాల్స్ ద్వారా సాన్నిహిత్యం పెంచుకుని, ఆ తర్వాత పెళ్లి ఖర్చులు, ప్రయాణ వ్యయాలు, బహుమతులు, అత్యవసర పరిస్థితుల పేరుతో డబ్బులు కోరుతున్నారని పోలీసులు వెల్లడించారు. కొంతమంది కేసుల్లో డబ్బులు పంపిన వెంటనే ఖాతాలు మూసివేయడం, సంప్రదింపులు నిలిపివేయడం జరుగుతోందని తెలిపారు. ఆధార్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత ఫొటోలు వంటి సున్నితమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వారికి ఇవ్వవద్దని పోలీసులు

సూచించారు. నేరుగా కలవ కుండా డబ్బులు అడిగే ప్రొఫైల్స్ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకో వాలని, అనుమా నాస్పద లింకులు తెరవకుండా ప్రయాణ వ్యయాలు, బహుమతులు, అత్యవసర పరిస్థితుల పేరుతో డబ్బులు కోరుతున్నారని పోలీసులు వెల్లడించారు. కొంతమంది కేసుల్లో డబ్బులు పంపిన వెంటనే ఖాతాలు మూసివేయడం, సంప్రదింపులు నిలిపివేయడం జరుగుతోందని తెలిపారు. ఆధార్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత ఫొటోలు వంటి సున్నితమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వారికి ఇవ్వవద్దని పోలీసులు ఉండాలని హెచ్చ రించారు. ఇలాం టి మ్యాట్రి మోని మోసాలకు గురైన వారు వెంటనే సైబర్ నేర విభాగాన్ని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్ర దించాలని తెలంగాణ పోలీసులు కోరారు. పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించడమే రక్షణ మార్గమని, ప్రజల అవగాహనతోనే ఈ తరహా సైబర్ నేరాలను అడ్డుకోవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.



# స్కానింగ్ సెంటర్లలో డీఎంహెచ్ఓ తనిఖీలు



- లింగ నిర్ధారణ చేస్తే ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా
- నిబంధనలు అతిక్రమిస్తే సెంటర్ల సీజ్
- వైద్యా, ఆరోగ్యశాఖ అధికారుల హెచ్చరిక

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్యశాఖ కొరడా ఝుళిపించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని పలు స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డీఎంహెచ్ఓ డాక్టర్ రజిత ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్లలోని రికార్డులు, మిషన్ల రిజిస్ట్రేషన్ వివరాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. స్కానింగ్ సెంటర్లలో ప్రతి రోగికి సంబంధించిన 'ఫామ్-ఎఫ్' వివరాలను విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డాక్టర్ రజిత ఆదేశించారు. రేడియాలజిస్ట్‌ల వివరాలు, స్కానింగ్ మిషన్ల సామర్థ్యం తదితర అంశాలు పీసీపీఎన్‌డీటీ సర్టిఫికెట్‌లో ఉన్న వివరాలతో సరిపోలాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ లేని మిషన్లను వినియోగించినా, అర్హత లేని వారితో స్కానింగ్ చేయించినా సెంటర్ల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని తెలిపే బోర్డులను ప్రతి సెంటర్‌లో ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని డీఎంహెచ్ఓ సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం సామాజిక నేరం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50 వేల జరిమానా విధిస్తామని ఆమె పేర్కొన్నారు. ఆడిట్ సమయంలో వివరాలు నమోదు చేయని యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్నాగేంద్రబాబు, డిప్యూటీ డెమో రాజకుమార్, మానాల స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూ జర్నలిజం విభాగంలో గోల్డ్ మెడల్ ఏర్పాటు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జనధర్మ, వరంగల్ వాణి పత్రికల వ్యవస్థాపకుడు ఎం.ఎస్. ఆచార్య, మాడా భూషణం రంగనాయకమ్మ స్మారకార్థంగా గోల్డ్ మెడల్‌ను ఏర్పాటు చేసినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. ఈ గోల్డ్ మెడల్ ను కాకతీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆంగ్ల విభాగ ఆచార్యులు ఆచార్య ఎం. రాజగోపాలాచార్య, వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా, ఇందుకోసం రూ.3 లక్షలను విశ్వవిద్యాలయ గోల్డ్ మెడల్ ఖాతాలో జమచేయడం జరిగింది. ప్రతి సంవత్సరం ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఈ గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నారు. 2027 విద్యా సంవత్సరం నుంచి ఈ అవార్డు అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్‌కు సంబంధించిన ఉత్తర్వులను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా ఆచార్య ఎం. రాజగోపాలాచార్యకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లతో పాటు ఆచార్య బి. సురేష్ లాల్, ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ ఎస్. మల్లేశ్వర్, సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కమీషన్ చెక్కులు అందజేత



- రూ. 9 కోట్ల 77లక్షలకుపైగా విలువైన చెక్కులు పంపిణీ

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసిన ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్, డీసీఎంఎస్ బాధ్యులకు కమీషన్ చెక్కులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పంపిణీ చేశారు. జిల్లాలో ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఖరీఫ్ 2023-24 సీజన్ లో ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా 30శాతం కమీషన్ రూ. 1,90,73,487, అలాగే రబీ సీజన్లో 2023- 24 లో 2,62,446 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 100 శాతం కమిషన్ రూ. 7,86,91,920 విలువైన చెక్కులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పంపిణీ చేశారు. మొత్తం రూ. 9 కోట్ల 77 లక్షలకుపైగా విలువైనవి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాశ్, డీఎం రజిత, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, డీసీఎంఎస్ ఇంచార్జి శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# కేయూ లైబ్రరీ సైన్స్ విభాగంలో గోల్డ్ మెడల్ ఏర్పాటు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయ లైబ్రరీ సైన్సు విభాగంలో లేట్ బండారి చంద్ర శేఖర్, లేట్ బండారి రమణి రత్నం పేరా గోల్డ్ మెడల్ ఏర్పాటు చేసినట్టు, లైబ్రరీ సైన్సు విభాగ అధిపతి డాక్టర్ బి. రాధిక రాణి ఒక ప్రకటనలో తెలిపారు. దీని నిమిత్తం రూ. 3లక్షలు యూని వర్సిటీ గోల్డ్ మెడల్ అకౌంట్లో జమ చేసినట్టు, 2027 వార్షిక సంవత్సరం నుంచి మాస్టర్ ఇన్ లైబ్రరీ సైన్సులో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులుకు అందచేయనునట్టు తెలిపారు. దీనికి సంబందించిన ఉత్తర్వులు వైస్ ఛాన్సలర్ నుంచి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ బి. దీపా జ్యోతి, డాక్టర్ బి. రాధిక రాణి, డాక్టర్ ఆర్. మేఘనా రావు, డాక్టర్ ఎన్.రమణ, డాక్టర్ కే. భిక్షాలు, జి. కృష్ణ పాల్గొన్నారు.

# గుడుంబా విక్రేతలపై కేసు నమోదు

- 12 లీటర్ల సారా స్వాధీనం



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపూర్ గ్రామంలో కొందరు వ్యక్తులు యథేచ్ఛగా గుడుంబా విక్రయిస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్ రెడ్డికి ముందస్తు సమాచారం అందింది. దీంతో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎస్ఐ రాహుల్ రెడ్డి తన సిబ్బందితో కలిసి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా గ్రామానికి చెందిన అనరాసి పోచమ్మ, అనరాసి రామవ్వ ఇళ్లలో సోదాలు నిర్వహించగా, విక్రయానికి సిద్ధంగా ఉంచిన 12 లీటర్ల గుడుంబా లభ్యమైంది. దీంతో పోలీసులు సారాను స్వాధీనం చేసుకుని, సదరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాహుల్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో అక్రమంగా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# జీవో నెంబర్ 252తో జర్నలిస్టులకు తీరని నష్టం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

- ప్రభుత్వం జీవోను వెంటనే సవరించాలి
- టీయూడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా
- ఈనెల 27న కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన కార్యక్రమం

అర్హులైన ప్రతి జర్నలిస్టుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలో శ్రీ ముత్యాల పోచమ్మ ఫంక్షన్ హాల్లో జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతగిరి రిజర్వాయర్ వద్ద బుధవారం యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశ ప్రారంభంలో వివిధ కారణాలవల్ల ఇటీవల మరణించిన జర్నలిస్టులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం లాయక్ పాషా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని మీడియా అకాడమీని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 252 ద్వారా జర్నలిస్టులకు తీరని నష్టం వాటిల్లుతుందని, వెంటనే ప్రభుత్వం జీవో ను సవరించాలని కోరారు. లేకుంటే ఈనెల 27న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులను ఏకం చేసి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అల్లం నారాయణ నేతృత్వంలో టీయూడబ్ల్యూజే సంఘం ఎల్లప్పుడూ పోరాటం చేసిందనీ, రాబోయే రోజుల్లో జర్నలిస్టుల పక్షాన ఉద్యమాలు చేస్తుందని భరోసా ఇచ్చారు. యూనియన్ సభ్యులకు టియుడబ్ల్యూజే హెచ్ 143 ఐడి కార్డులను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామల గట్టు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా టెంజు అధ్యక్షుడు ఇరుకుల్ల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి అజీమ్ తో పాటు జిల్లా కార్యవర్గం సభ్యులు, ఇల్లంతకుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పైడి రాజు, గుర్రాల మోహన్, బట్టు శ్రీనివాస్, బొల్లం పరశురాం, అనిల్, శంకర్, సలీం, చీరాల రాజు, న్యాలం చందు, రాచకొండ రేవంత్ గౌడ్, బొల్లం సాయి రెడ్డి, వెంకట్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# గొర్రెలకు నట్టల మందు పంపిణీ

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని అనంతారం గ్రామంలో బుధవారం గొల్ల, కురుమ గొర్రెల పెంపకదారులకు చెందిన గొర్లకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత, వెంకటేశం ముఖ్య అతిథులుగా పాల్గొని గొర్లకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే పెంపకదారుల జీవన భద్రత బలపడుతుందని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు నివారణ చర్యలు ఎంతో అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు పెంపకదారులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి పూర్ణ చంద్రిక, ఉప సర్పంచ్ కదం జయంత్, వార్డు సభ్యులు చొప్పరి సాయిలు, ఆక్కెం ఉపేందర్, మల్యాల రాజశేఖర్, గోనపల్లి లావణ్య వెంకటేశం, సిరిపురం రమేష్‌తో పాటు గొల్ల, కురుమ గొర్రెల పెంపకదారులు జక్కుల తిరుపతి, జక్కుల పర్శయ, గాంతుల ఎల్లయ్య, ఆక్కెం దేవయ్య, దారవేణి మల్లేశం, ఆసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ గుడి పనులు పునః ప్రారంభం




**వేద న్యూస్, దామరచర్ల :**

దామరచర్ల గ్రామ యాదవుల ఆరాధ్య దేవత గంగమ్మ తల్లి గుడి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బంటు రేణుక సిరి ఆర్థిక సహాయం చేసి బుధవారం గుడి నిర్మాణ పనులను పునః ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బంటు కిరణ్, గొర్రెల పెంపకదారుల సహకార సంఘం చైర్మన్ పగిడి జీడయ్య యాదవ్, సెక్రటరీ కానసాని సోమయ్య, ఉపాధ్యక్షులు నన్నే బోయిన రాజు, పెద్ద గొల్ల కుర్ర వెంకన్న, మన్నెం నాగయ్య, పంచాయతీ కార్యదర్శి బొమ్మనబోయిన జానకి రాములు, వార్డు నెంబర్లు కుర్ర నాగరాజు, జానపాటి కృష్ణయ్య, చింతలచెరువు పర్వతాలు, దార గాని జనార్ధన్, కొండారపు పూర్ణ, పగిడికొండలు, అప్పనబోయిన సైదులు, బీసం ఏడుకొండలు, మోదాల రాంమల్లి, పగిడి సైదయ్య, కానసాని శ్రీను, బద్రి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ లడ్డూ కౌంటర్‌లోకి పాము

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఆలయ ప్రాంగణంలోని లడ్డూ ప్రసాద విక్రయ కౌంటర్‌లోకి ఒక్కసారిగా జర్రిపోతు పాము ప్రవేశించింది. అక్కడి సిబ్బంది పామును చూసి భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన ఆలయ అధికారులు, స్థానిక స్నేక్ క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న జగదీష్ పామును పట్టుకున్నారు. అది విషపూరితం కాని పాము అని నిర్ధారించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఆయన ఆ పామును సురక్షితంగా సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

# చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనలో ట్విస్ట్

**హైదరాబాద్ వేద న్యూస్ :**

చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనలో ట్విస్ట్. టిప్పర్ యజమాని లచ్చు నాయక్‌ను పోలీసులు నిందితుడిగా నిర్ధారించారు. ప్రమాదానికి ఓవర్‌లోడ్‌తో ఉన్న టిప్పర్‌ను డ్రైవర్ అతివేగంతో నడపడమే కారణమని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఈ మేరకు లచ్చు నాయక్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ ఏడాది నవంబర్ 3వ తేదీన చేవెళ్ల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును మీర్జాగూడ దగ్గర టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని 18 మంది ప్రయాణికులు, టిప్పర్ డ్రైవర్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం జరిగినప్పుడు లచ్చు నాయక్ టిప్పర్‌లోనే ఉన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతను ఇంకా కోలుకోలేదు. పూర్తిగా కోలుకున్న తర్వాతే విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

# ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

- ప్రపంచమంతా శాంతి మార్గంలో నడవాలి
- కేయూ రిజిస్ట్రార్ ప్రొ. వల్లూరి రామచంద్రం
- కేయూ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ప్రపంచమంతా శాంతి మార్గంలో నడవాలని, ఏసుక్రీస్తు బోధనలను అనుసరించి ముందుకు సాగాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. కేయూ ప్రధాన గ్రంథాలయం వద్ద విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేయూ రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దయా, కరుణ కలిగి ఉండాలని, ఇతరుల పట్ల కృతజ్ఞత చాటుకోవాలన్నారు. క్రిస్మస్ అంటే కేవలం వేడుక మాత్రమే కాదు ఇతరుల కోసం ఆలోచించడం, సేవ చేయడమేనన్నారు. క్రిస్మస్ పర్వదినం ప్రేమ, సోదర భావం, శాంతి సందేశాన్ని అందరూ గుర్తు చేసుకోవాలని అన్ని వర్గాల ప్రజలు ఒకరికి ఒకరు పరస్పర గౌరవంతో జీవించాలని ఈ పండుగ సారాంశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఇంచార్జ్ జవహర్, విద్యార్థి జేఏసీ వ్యవస్థాపకుడు మంద వీరస్వామి, బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, విద్యార్థి జేఏసీ చైర్మన్ బొచ్చు తిరుపతి, కన్వీనర్ బోట్ల మనోహర్, కో-కన్వీనర్ ఏల్తూరి సాయి కుమార్, పెండ్యాల రాకేష్, జేఏసీ విద్యార్థి నాయకులు అడ్డురీ గణేశ్, కొనుకంటి ప్రశాంత్, రమేష్, సుమన్, విద్యార్థినులు శ్రావణి, అంజలి, లక్ష్మీ, సౌజన్య, నవ్య, అనూష తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజుల్లో జీపీలకు నిధులివ్వాల్సిందే..

- లేకుంటే హైదరాబాద్ నడిబొడ్డున పరేడ్ చేస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**వేద న్యూస్, కరీంనగర్:**

రాబోయే నెలరోజుల్లో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో కలిసి హైదరాబాద్ లో పరేడ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. నిధులను మంజూరు చేసిన తరువాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ సాకుతో నిధుల విడుదలలో జాప్యం చేస్తే కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ సర్పంచులను గెలిపించిన గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. బుధవారం కరీంనగర్లోని రేకుర్తి శుభం గార్డెన్స్ లో బీజేపీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ మద్దతుతో గెలిచిన సర్పంచులను, ఉప సర్పంచులను, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులందరికీ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. సర్పంచ్ గిరి చేయాలంటే ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సహకారం తప్పనిసరి అని, ఈ ముగ్గురు కలిసి ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. మీ గెలుపు కోసం కుటుంబ సభ్యులతోపాటు కార్యకర్తలు, సీనియర్ నాయకులు అంతా కలిసి కృషి చేశారని, వాళ్లందరి కృషివల్లే 108 మంది సర్పంచులను బీజేపీ మద్దతుతో గెలిచారన్నారు. ఇకపై బీజేపీ సర్పంచులున్న 108 గ్రామాల అభివృద్ధికి తన మొదటి ప్రాధాన్యత ఇస్తానని, ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఆయా గ్రామాలను తీర్చిదిద్దుతామన్నారు. ఎంపీ లాడ్స్ తోపాటు సీఎస్సార్ ఫండ్స్ తీసుకొస్తానని, ప్రతి గ్రామంలో ఒక వాటర్ ప్లాంట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నానన్నారు. రాబోయే నెల రోజుల్లో గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని, ఆ తరువాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు.

# ప్రతి గ్రామంలో మహిళా భవనాలు

- గ్రామీణ మహిళలకు అండగా ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ భవనాలు
- రూ.10 లక్షలతో.. 200 గజాల్లో నిర్మాణం
- ప్రభుత్వ స్థలాల గుర్తింపుతో పనులు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలు, గ్రామ స్థాయి సంస్థలు, ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్‌లకు శాశ్వత వేదికగా నిలిచే భవనాల నిర్మాణానికి సవరించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. గ్రామ స్థాయిలో మహిళా సంఘాల బలోపేతానికి ఇది చారిత్రాత్మక ముందడుగు అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ప్రతి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో మహిళా భవనాలను నిర్మించనున్నారు. సుమారు 200 గజాల విస్తీర్ణంలో, 552 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో ఈ భవనాలు రూపుదిద్దుకోనున్నాయి. మహిళా సంఘాలు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఇవి శాశ్వత కేంద్రాలుగా ఉపయోగపడనున్నాయి. గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో, వాటిని గుర్తించి మహిళా భవనాల నిర్మాణాన్ని చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంస్థలు, ఫెడరేషన్‌ల కోసం శాశ్వత భవనాలు కల్పించాలని మహిళా సభ్యులు చాలా కాలంగా చేస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు సంఘటితంగా పనిచేసేందుకు మౌలిక సదుపాయాల కొరత ఒక ప్రధాన అడ్డంకిగా ఉండేదని అధికారులు తెలిపారు. ఈ మహిళా భవనాల నిర్మాణంతో ఆ సమ స్య తొలగిపోతుందని, మహిళల ఆర్థిక కార్య కలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం కలుగు తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచ డమే కాకుండా, వారి స్వావలంబన దిశగా కీలకంగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# పతంగుల పండుగకు చెరువులను సిద్ధం చేయాలి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సంక్రాంతి పతంగుల పండగ నాటికి చెరువులను సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహించే పతంగుల పండగను ఈసారి హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత కూడా నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. మాధాపూర్‌లోని తమ్మిడికుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువులను సందర్శించి పలు కీలక సూచనలు చేశారు. చెరువుల్లోకి నేరుగా మురుగు నీరు చేరకుండా ఎస్‌టీపీల ద్వారా శుద్ధి చేసిన నీరు మాత్రమే చేరేలా వెంటనే ఏర్పాట్లు చేయాలని కమిషనర్ సూచించారు. ఎస్‌టీపీల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా పతంగుల పండుగ ఆహ్లాదకర వాతావరణంలో జరగాలంటే జీహెచ్‌ఎంసీ, పర్యాటక శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పనిచేయాల్సిన అవసరం ఉందని కమిషనర్ అధికారులకు సూచించారు. చెరువుల చెంత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా సులభంగా రాకపోకలకు అనుకూలంగా పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో దుమ్ము, ధూళి ఎగరకుండా నీళ్లు చిలకరించాలని ఆదేశించారు. మురుగు నీటితో దుర్గంధభరితంగా మారి ఆక్రమణలకు గురైన చెరువులు హైడ్రా అభివృద్ధితో సంబురాలకు వేదికలుగా మారుతున్నాయని అధికారులు తెలిపారు. ఇటీవల బతుకమ్మ ఉత్సవాలకు అంబర్‌పేట బతుకమ్మ కుంట వేదిక కాగా, ఈ సంక్రాంతికి బతుకమ్మ కుంటతో పాటు మాధాపూర్ తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్ల చెరువు, పాతబస్తీలోని బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు వేదికలుగా మారనున్నాయి. హైడ్రా మొదటి విడతలో చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణలో ఉప్పల్ నల్లచెరువు, మాధాపూర్ సున్నం చెరువు ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందని పేర్కొన్నారు. ఆక్రమణలతో కనుమరుగవుతాయనుకున్న చెరువులు విస్తీర్ణం పెంచుకుని నగర నడిబొడ్డున ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుండటంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఫర్టిలైజర్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ బంటు రేణుక సిరి



**వేద న్యూస్, దామరచర్ల:**

యూరియాను సద్వినియోగం చేసుకుందుకు ప్రభుత్వం ప్రత్యేక తీసుకోచ్చిన ఫర్టిలైజర్ యాప్ ను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని దామరచర్ల సర్పంచ్ బంటు రేణుక సిరి ,వ్యవసాయ అధికారి ఋషేంద్ర మణి లు కోరారు. దామరచర్ల గ్రామపంచాయతీ ఆవరణలో ఫర్టిలైజర్ యాప్ పై బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సు లో వారు మాట్లాడారు.ముందుగా రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుండి యాప్ డౌన్లోడ్ చేసుకొని అందులో తమ వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు.వివరాలు నమోదు చేసిన తర్వాత, రైతులు 24గంటలలో యూరియా తీసుకెళ్లాలని చెప్పారు.యూరియా డీలర్లు తమ వివరాలను యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బంటు కిరణ్, ఏఈఓ పార్వతీ, నాయకులు కందుల శ్యామ్ సుందర్ రెడ్డి , మన్నెం నాగయ్య, పూర్ణచంద్ర రావు, జనార్ధన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లంతకుంట మండలాన్ని అభివృద్ధి చేయాలి

- సామాజిక ఉద్యమ కారుడు సావనపెల్లి రాకేష్
- 26వ తేదీనుంచి నెల రోజులపాటు రిలే నిరాహార దీక్షలు



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ప్రభుత్వాలు మారుతున్నా ఇల్లంతకుంట మండలం అభివృద్ధికి నోచుకోవడం లేదని, మండల పరిధిలోని గ్రామాలల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం చాలా బాధాకమని సామాజిక ఉద్యమ కారుడు సావనపెల్లి రాకేష్ విలేకరుల అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. ఇల్లంతకుంట నుండి అనంతారం, రహీంఖాన్ పేట, వల్లంపట్ల ఒగులాపూర్ మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సరైన రోడ్లు లేక, గుంతలమయమై బస్లో ప్రయాణం చేయడానికి ప్రజలు, మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో అతిపెద్ద మండలమైన ఇల్లంతకుంటలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఉన్నత చదువులు చదువుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలో ఆపేసి యువత బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 26 నుంచి జనవరి 26వరకు నెల రోజుల పాటు, రిలే నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,యువకులు, విద్యార్థులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు.

# డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నాడని టవరెక్కి రైతు నిరసన

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



తన భూమిని కొనుగోలు చేసి, సకాలంలో డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్నాడంటూ రవి అనే రైతు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలపిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధిత రైతు రవి కథనం ప్రకారం.. తనకు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించారు. అయితే, భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి గానీ, ఇతర లావాదేవీల విషయంలో గానీ ఒప్పందం కుదుర్చు కున్నప్పటికీ, సదరు వ్యక్తి సకాలంలో డబ్బులు ఇవ్వకుండా రవిని తిప్పుకుంటున్నారు. పలుమార్లు అడిగినా ఫలితం లేకపోవడమే కాకుండా, తనను మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ రవి ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. రైతు టవర్ ఎక్కిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ రైతుతో చర్చలు జరిపారు. కిందికి దిగి రావాలని పోలీసులు రవిని కోరారు. భూమి సమస్యను పరిష్కరించి, అతనికి రావాల్సిన డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసుల భరోసాతో శాంతించిన రవి సుమారు గంట తర్వాత సురక్షితంగా కిందకు దిగివచ్చారు. దీంతో పోలీసులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామని పోలీసులు తెలిపారు.

# ప్రైవేట్ పాఠశాలలో అమానుషం

- ఒకటో తరగతి బాలికపై ఎనిమిదో తరగతి బాలుడి అసభ్య ప్రవర్తన
- కరీంనగర్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

**వేద న్యూస్, చొప్పదండి:**



కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చోటుచేసుకున్న ఒక దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఒకే పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల బాలికపై ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాల ప్రాంగణంలోనే పసి హృదయాలు విషబీజాల వైపు మళ్లడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థుల భద్రతను గాలికి వదిలి వేలకు వేల ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల భద్రతను గాలికి వదిలేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతటి అమానుష ఘటన జరిగినా పాఠశాల యాజమాన్యం తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించడంపై గ్రామస్తులు భగ్గుమంటున్నారు. కేవలం ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ, క్రమశిక్షణ, పర్యవేక్షణపై లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని, ఈ ఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు. పసిపాప భవిష్యత్తుకు భంగం కలిగించేలా ప్రవర్తించిన బాలుడిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రైవేట్ పాఠశాల అనుమతులను తక్షణమే రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో చిన్నారుల రక్షణకు హామీ లేకపోతే పంపడం ఎలా అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073